సాక్షి ప్రకాశం
శుక్రవారం । 7 । జూలై । 2023



శునక షోయగం
వరల్డ్ జూనోసిస్ డేని గురువారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కల ప్రదర్శన నిర్వహించి వ్యాక్సిన్లు వేశారు. - 8లో..



గంజాయి లేకుండా చేయాలి
గంజాయి కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చేసి జిల్లాలో దాని జాడ లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/27

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు ఒంగోలు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి శనివారం ఒంగోలు రానున్నట్లు ఎంపీ కార్యాలయ మేనేజర్ భవనం సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30కు స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమంలో ఎంపీ పాల్గొంటారు. 11 గంటలకు చర్చి సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పుష్పమాలంకరణ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం తన కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు మాగుంట అందుబాటులో ఉంటారు.

పద్మ అవార్డుల నామినేషన్లకు ఈ నెల 12 చివరి తేదీ

ఒంగోలు: కేంద్ర ప్రభుత్వం 2024 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించే పద్మ అవార్డుల నామినేషన్ల కోసం జాతీయస్థాయిలో వివిధ అంశాల్లో ఉత్తమ సేవలు, ప్రతిభ కనబరిచిన వారు ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.బాబూరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళారంగం, విద్య, సాహితీరంగం, క్రీడారంగం, వైద్యం, సామాజిక సేవ, సైన్స్, ఇంజినీరింగ్, ప్రజా సంబంధాలు, పౌరసేవలు, తయారీ సేవారంగం మొదలైన వాటికి సంబంధించి పద్మ అవార్డుల వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పద్మఅవార్డ్స్.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయ పనివేళల్లో స్వయంగా లేదా సెల్ నంబర్ 9182891095ను సంప్రదించాలని సూచించారు.

విభిన్న ప్రతిభావంతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: జాతీయస్థాయిలో దివ్యాంగులకు ప్రత్యేకంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి సాధికారతకు కృషిచేస్తున్న దివ్యాంగులు, వ్యక్తులు, సంస్థల నుంచి కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జి.అర్చన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.అవార్డ్స్‌జీవోవీ.ఇన్‌లో ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్ని అర్హతలు, నిబంధనల మేరకు ఎంపికైన వారికి కేంద్రం డిసెంబర్ 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం రోజు జాతీయ అవార్డులు ప్రదానం చేస్తుందన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షునిగా జాలిరెడ్డి




జాలిరెడ్డి



వెంకటేశ్వరరెడ్డి

ఒంగోలు: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షునిగా కేశవరపు జాలిరెడ్డి నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షుడు వి.విజయసాయిరెడ్డి రాష్ట్ర కమిటీని ప్రకటించారు. ఈ కమిటీలో ప్రకాశం జిల్లా నుంచి మొత్తం 8 మందికి స్థానం దక్కింది. గతంలో రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసిన కేశవరపు జాలిరెడ్డిని రాష్ట్ర గౌరవాధ్యక్షునిగా ప్రకటించారు. జిల్లా అధ్యక్షునిగా పనిచేసిన గౌరవరపు వెంకటేశ్వరరెడ్డిని రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షునిగా నియమించారు. వీరితో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.వెంకటరెడ్డి (కనిగిరి), ఉపాధ్యక్షునిగా బి.పెద్దిరాజు (పొదిలి), కార్యదర్శులుగా కె.తిరుపతిరెడ్డి (కనిగిరి), బి.శ్రీనివాసరావు (సింగరాయకొండ), వి.వెంకట్రామిరెడ్డి (మార్కాపురం), కె.రమణారెడ్డి (కనిగిరి)ని నియమించారు. వీరి పదవీ కాలం ఏడాదిపాటు ఉంటుంది. వీరికి పలువురు ఉపాధ్యాయులు, వైఎస్సార్ టీఎఫ్ నాయకులు అభినందనలు తెలిపారు.

డీఆర్‌డీఏ పీడీగా రవికుమార్



రవికుమార్

ఒంగోలు సబర్బన్: డీఆర్‌డీఏ పీడీగా తేళ్ల రవికుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ సెర్ప్ సీఈవో ఇచ్చిన ప్రొసీడింగ్స్ ప్రకారం విధుల్లో చేరారు. మెప్మా పీడీగా రవికుమార్ పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు డీఆర్‌డీఏ పీడీగా విధులు నిర్వర్తించిన బి.బాబూరావు తన సొంత విభాగం ఐడీసీకి వెళ్లిపోయారు. దీంతో ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు డీఆర్‌డీఏ పీడీగా మెప్మా పీడీ రవికుమార్ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు.

పల్లె ముంగిట సాగు సందడి

జిల్లాలో ఖరీఫ్ సందడి మొదలైంది. నైరుతీ రుతుపవనాలు కొంత ఆలస్యంగా జిల్లాను తాకాయి. వరుణుడి కరుణతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతాంగం ముమ్మరంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమైంది. ఇప్పటికే భూగర్భ జలాలు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో బోర్ల కింద ఆరుతడి పంటల సాగు మొదలైంది. ఈ సీజన్‌లో 2.17 లక్షల హెక్టార్లలో పంటల సాగు లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎరువులు, యూరియాలతో పాటు ఆర్‌బీకేలలో ఆధునిక యంత్రాలు సైతం అందుబాటులో ఉంచారు.



వరి నాటుతున్న మహిళా కూలీలు

- జిల్లాలో మొదలైన ఖరీఫ్ సీజన్
- 2.17 లక్షల హెక్టార్ల సాగు లక్ష్యం
- అందుబాటులో యూరియా, డీఏపీ సహా అన్నిరకాల ఎరువులు 60 వేల టన్నులు
- ఖరీఫ్ సీజన్ కోసం ఇప్పటికే రూ.213.12 కోట్లు జమ
- అందుబాటులో ఆధునిక యంత్రాలు
- వ్యవసాయ రుణాలు అందించేందుకు సిద్ధంగా బ్యాంకులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఖరీఫ్, రబీ సీజన్లలో పుష్కలంగా పంటలు పండుతున్నాయి. గత సంవత్సరం వరకు సీజన్ల వారీగా రుతు పవనాలు సకాలంలో ప్రవేశిస్తూ వస్తున్నాయి. అలాగే పుష్కలంగా సాగర్ జలాలు జిల్లాకు వచ్చి చేరుతున్నాయి. పశ్చిమ ప్రాంతంలో సైతం భూగర్భ జలాలు బాగున్నాయి. రైతు బాంధవుడిగా పేరుపొందిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులను ఆదుకునేందుకు అన్నివిధాలా చేయూతనందిస్తున్నారు. గ్రామాల్లోనే గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ఏర్పాటు చేసి మండల, రెవెన్యూ డివిజన్ కేంద్రాలకు రైతులు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్నీ పల్లె సీమల్లోనే రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. పంటల సాగుకు దుక్కి దున్నే సమయం నుంచి పండించిన పంటలకు గిట్టుబాటు ధరల దక్కేంత వరకు అన్నీ ప్రభుత్వమే దగ్గరుండి చూసుకుంటూ రైతులకు అండగా నిలుస్తోంది. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు ఎలాంటి అవసరాలైనా సరే తీరుస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెన్నుదన్నుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచారు. పెట్టుబడి సాయాన్ని కూడా ఒక నెల ముందుగానే ఇచ్చారు.

86,033 టన్నుల ఎరువులు సిద్ధం...

ఖరీఫ్ సీజన్ కోసం జిల్లాలో 59,093 టన్నుల ఎరువులు అవసరం అవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఇవి కాకుండా రబీ సీజన్ పూర్తయిన తర్వాత జిల్లా వ్యాప్తంగా మిగులు నిల్వలు 26,940 టన్నులను కూడా రైతులకు అందించేలా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఏప్రిల్ నెల నుంచే ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచింది. ఏప్రిల్ నుంచి ఖరీఫ్ సీజన్ ముగిసే సెప్టెంబర్ వరకు నెలల వారీగా రైతులకు పంటల సాగు ఉధృతిని బట్టి ఎరువులు సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. జిల్లాకు సాధారణ అలాట్‌మెంట్ కింద ముందస్తుగా 59,093 టన్నుల ఎరువులు సిద్ధం చేశారు. వాటిలో కొంతమేర.. అంటే 17,168 టన్నుల ఎరువులను జిల్లాలోని 500 ఆర్‌బీకేల్లో రైతులకు అందుబాటులో ఉంచనున్నారు.

రైతు భరోసా కింద ఖరీఫ్ కోసం రూ.213.12 కోట్లు జమ...

ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు సన్నద్ధం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.213.12 కోట్లు ఇప్పటికే రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. పంటల సాగు కోసం పెట్టుబడి సాయం కింద డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం కింద జిల్లాలోని మొత్తం 2,84,113 రైతు కుటుంబాలకు ప్రయోజనం చేకూరింది. వ్యవసాయ పెట్టుబడి సాయంగా మొదటి విడతలో ప్రతి రైతు కుటుంబానికి రూ.7,500 చొప్పున అందజేశారు. వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.156.75 కోట్లు, పీఎం కిసాన్ పథకం కింద రూ.56.37 కోట్లు ప్రభుత్వాలు విడుదల చేశాయి. జిల్లాలోని రైతాంగానికి రైతు భరోసా పథకం కింద గత రబీ సీజన్ వరకు మొత్తం రూ.1,421.77 కోట్లు ఇచ్చినట్లయింది. 2023 ఖరీఫ్ సీజన్ కోసం పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకంలో ఈ ఏడాది మే 30వ తేదీ రూ.213.12 కోట్లు జమ చేశారు. మొత్తం మీద వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటి వరకు రూ.1,634.89 కోట్లు రైతు కుటుంబాలకు ఇచ్చినట్లయింది.

ఖరీఫ్ లక్ష్యం 2.17 లక్షల హెక్టార్లు...

ఖరీఫ్–2023 సంవత్సరంలో పంటల సాగు చేసేందుకు లక్ష్యం 2.17 లక్షల హెక్టార్లుగా వ్యవసాయ శాఖ నిర్దేశించింది. గత నాలుగేళ్లలో కూడా ఖరీఫ్ సాగు విస్తారంగానే ఉంది. ఈ సీజన్‌లో ప్రధానమైనది కంది పంట. జిల్లా వ్యాప్తంగా 80 వేల హెక్టార్లలో కంది సాగు చేస్తారు. ఆ తర్వాత స్థానంలో పత్తి పంట 33 వేల హెక్టార్లలో సాగు చేస్తారు. మిర్చి 20,700 హెక్టార్లలో, వరి 16 వేల హెక్టార్లలో, సజ్జ 9,971 హెక్టార్లు, మొక్కజొన్న 3 వేల హెక్టార్లు, మినుము 3,300 హెక్టార్లు, పెసర 1,700 హెక్టార్లు, మైనర్ మిల్లెట్స్ 1,885 హెక్టార్లు, 2,900 హెక్టార్లలో నువ్వు, 2 వేల హెక్టార్లలో ఆముదం, 1,725 హెక్టార్లలో పొగాకు, 800 హెక్టార్లలో వేరుశనగ పంటలు సాగుచేస్తారు. మిగతావి జొన్న, రాగి, ఉలవలు, పశువుల మేత గడ్డి, పొద్దు తిరుగుడు, చెరకు లాంటి పంటలు మొత్తం కలిపి 39 వేల హెక్టార్లలో సాగు చేస్తారు.

రైతులకు అందుబాటులో యంత్ర సేవ...

ఖరీఫ్ సీజన్లో పంటల సాగు కోసం ఇప్పటికే ఆర్‌బీకేల వారీగా యంత్రాలను అందుబాటులో ఉంచారు. జిల్లాలోని 616 ఆర్‌బీకేల ద్వారా రైతులకు కావాల్సిన అన్ని రకాల యంత్రాలను రైతు సంఘాలే నిర్వహించుకునేలా చర్యలు చేపట్టారు. అదే విధంగా బ్యాంకులు వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు విస్తృతంగా ఇచ్చేందుకు కూడా రుణ ప్రణాళికలు సిద్ధం చేశాయి. ఇప్పటికే వ్యవసాయ రుణాలు ఇవ్వడం ప్రారంభించారు.

జిల్లాలోని ఎరువుల వివరాలు (టన్నుల్లో)

ఎరువు రకం	సాధారణ అలాట్‌మెంట్	ఆర్‌బీకేలకు సరఫరా	గత సంవత్సర నిల్వలు
యూరియా	18,292	6,816	7,900
డీఏపీ	7,179	2,798	2,000
ఎంఓపీ	2,157	185	480
కాంప్లెక్స్	27,574	6,944	15,666
ఎస్ఎస్‌పీ	3,991	425	894
మొత్తం	59,093	17,168	26,940



ఎరువుల కొరత లేదు...



జిల్లాలో ఎరువుల కొరత లేదు. ఏ రకం ఎరువులు కావాలన్నా రైతులకు అందుబాటులో ఉంచాం. గత సంవత్సరం ఎరువుల మిగులు నిల్వలతో పాటు ఈ సంవత్సరం కొత్త అలాట్‌మెంట్ కలిపి మొత్తం 86,033 టన్నులు అందుబాటులో ఉంచాం. అదేవిధంగా రైతులకు రవాణా ఇబ్బందులు లేకుండా జిల్లాలోని 616 ఆర్‌బీకేల్లో 17,168 టన్నులు ఇప్పటికే ఉన్నాయి. రైతులు ఎలాంటి పంటలు సాగుచేసుకున్నా ఇబ్బందులు లేకుండా సరఫరా చేయనున్నాం.
– పి.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

ఆరోపణలపై విచారణ చేపట్టండి

- నిజమని తేలితే పోలీసు కేసుకు సిద్ధం
- సీఎం వైఎస్ జగన్ మార్గదర్శకత్వంలో పారదర్శకంగా సేవలందిస్తున్నాం
- నిజానిజాలు తెలుసుకుని ఆరోపణలు చేయాలి
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, నాయకులు

ఒంగోలు అర్బన్: తనపై, తన కుటుంబంపై వచ్చిన ఆరోపణలు, వాటికి సంబంధించి పలు మీడియాల్లో వచ్చిన అసత్య కథనాలపై సమగ్రంగా విచారణ జరపాలని కోరుతూ మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి గురువారం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మార్కాపురం నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో ఒంగోలులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని కలెక్టర్‌ను కలిశారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులతో పాటు పలు మీడియా సంస్థలు తనపై, తన కుటుంబంపై ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. తన కుటుంబం గత 50 ఏళ్లుగా రాజకీయాల్లో ఉందని, తమ కుటుంబం గురించి, తన గురించి నియోజకవర్గంలో ప్రజలందరికీ తెలుసని అన్నారు. ఆరోపణలపై విచారణ జరపాలని తానే స్వయంగా కలెక్టర్‌ను కోరానంటే.. తామెంత పారదర్శకంగా ఉన్నామో అర్థం చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి మీడియాలో కథనాలు రాస్తే బాగుంటుందన్నారు. ఆరోపణలపై విచారణ జరిపించి అవి రుజువైతే తన కుటుంబ సభ్యులపై తానే స్వయంగా పోలీసు కేసు పెట్టి పోలీసులకు అప్పగిస్తానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజాయితీగా, పారదర్శకంగా కుల, మత, వర్గాలకు, పార్టీలకు అతీతంగా సేవలందించాలనే ఆదేశాలను తూ.చా.తప్పకుండా పాటిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. సీఎం సహకారంతో నియోజకవర్గంలో ఎప్పటి నుంచో ఉన్న సమస్యలను పరిష్కరించామన్నారు. పొదిలి పెదచెరువు ప్రాజెక్టు పనులు ప్రారంభించామన్నారు. ముల్లా వారికి బీసీ–ఈ సర్టిఫికెట్లు ఇప్పించామన్నారు. మార్కాపురానికి రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీ రావడం నియోజకవర్గానికి వరం లాంటిదన్నారు. ఎప్పుడో నిలిచిపోయిన షాదీఖానా పనులు ప్రారంభించామన్నారు. తానుగానీ, తన కుటుంబంగానీ ఒక్క సెంటు భూమి తీసుకున్నా, కబ్జా వంటివి చేసినా ఎవరైనా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. నిజానిజాలను అధికారులు నిగ్గుతేలుస్తారన్నారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను మార్కాపురం నియోజకవర్గంలో నూరు శాతం పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను పరిశీలించిన అధికారులు



వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ రమేష్‌బాబు

చీమకుర్తి: సంతనూతలపాడు ఏఎంసీ కార్యాలయం పరిధిలోని వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను వ్యవసాయశాఖ ఏడీఏ బీ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం పరిశీలించారు. నిర్మాణం పూర్తి కావడంతో ఈ నెల 8న ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నట్లు రమేష్‌బాబు తెలిపారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నాణ్యతను పరిశీలించడం, రైతులు పండించిన విత్తనాల నాణ్యతను కూడా పరిశీలించేందుకు వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 8న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ప్రారంభించే కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడు ల్యాబ్‌ను కూడా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నట్లు రమేష్‌బాబు తెలిపారు.

ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- విద్యాశాఖ గుంటూరు ఆర్జేడీ సుబ్బారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ సుబ్బారావు

ఒంగోలు: ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ వినియోగంపై శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ గుంటూరు ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు సూచించారు. స్థానిక రైజ్ కాలేజీ, పేస్ ఇంజినీరింగ్ కాలేజీలలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ వినియోగంపై గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులందరూ వారికి కేటాయించిన రోజు శిక్షణకు హాజరుకావాలన్నారు. త్వరలో నాడు–నేడు ఫేజ్ 1 పాఠశాలలు అన్నింటికీ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, స్మార్ట్ టీవీలు అందించడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులందరూ పాఠశాలల్లో వాటిని పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. వినియోగం తీరుతెన్నులను రాష్ట్ర స్థాయిలో పరిశీలించడం జరుగుతుందన్నారు. బైజూస్ కంటెంట్‌ను, దీక్ష యాప్‌లో ఉన్న సమాచారాన్ని ఐఎఫ్‌పీల ద్వారా సులువుగా నేర్పించవచ్చని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి విద్యాబోధన చేయడం అలవాటు చేసుకుంటే అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధనకు కృషిచేయాలని, త్వరలో జరిగే ఫార్మేటివ్ పరీక్షలను విద్యార్థులంతా ఆంగ్ల మాధ్యమంలో రాసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

విద్యార్థులకు ప్రతిరోజూ క్లాస్ వర్క్, హోం వర్క్ ఇవ్వాలని, వాటితోపాటు ప్రతి పదాన్ని పరిశీలిస్తూ మూల్యాంకనం చేసి చిన్నారులు సబ్జెక్టుపై పట్టు సాధించేలా కృషిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి డి.వెంకారెడ్డి, ఒంగోలు ఎంఈవో వన్ టి.కిషోర్‌బాబు, కోర్సు డైరెక్టర్లు పాల్గొన్నారు.

నూరు శాతం అక్షరాస్యతే లక్ష్యం



అక్షర ప్రకాశం 2.0లో పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత

- అక్షర ప్రకాశం 2.0 ప్రారంభోత్సవంలో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో నూరు శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా అక్షర ప్రకాశం 2.0ను తీసుకొచ్చామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. 15 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గల నిరక్షరాస్యులను గుర్తించి వారిని కూడా అక్షరాస్యులుగా మార్చే లక్ష్యంతో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ కార్యక్రమాన్ని గురువారం స్థానిక 31వ డివిజన్‌లోని విజయనగర కాలనీ సచివాలయం వద్ద మేయర్ గంగాడ సుజాతతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను మరింత ప్రకాశవంతంగా చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతిఒక్కరూ అక్షరాస్యులుగా మారాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి పైలెట్ ప్రాజెక్టు కింద వలంటీర్లతో సర్వే చేయించినట్లు వెల్లడించారు. నగరంలోని 10 సచివాలయాల పరిధిలో స్లమ్ ఏరియాల్లో నిరక్షరాస్యులుగా ఉన్న 1,570 మందిని గుర్తించామని తెలిపారు. వారందరినీ అక్షరాస్యులుగా మార్చేందుకు దృష్టి సారించామన్నారు. 45 రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు బోధించి ప్రైమరీ–1 కేటగిరీని చేరుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. మరో 50 రోజుల పాటు ఇదే విధంగా బోధించడం ద్వారా ప్రైమరీ–2 దశను కూడా పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో కూడా చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు, 31వ డివిజన్ కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకుడు తన్నీరు నాగేశ్వరరావు, విద్యాశాఖ మాజీ జేడీ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు అనుకూలంగా బస్సులు నడపాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్:

పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. పెద్దారవీడు మండలం రాజంపల్లి కేంద్రీయ విద్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు, మిట్టమీదపల్లె మోడల్ స్కూల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అందుబాటులో ఉన్న రవాణా సౌకర్యంపై గురువారం స్థానిక కలెక్టరేట్‌లో మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డితో కలిసి ఆర్టీసీ, విద్యాశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పాఠశాలలకు విద్యార్థులు వెళ్లి వచ్చేందుకు ఆయా సమయాల్లో తగిన స్థాయిలో రవాణా సౌకర్యం కల్పించడం ఎంతో ముఖ్యమన్నారు. జిల్లాలో చదువుకునేందుకు పక్క గ్రామాలకు వెళ్లి వస్తున్న విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని బస్సులు నడపాలన్నారు. విద్యాశాఖతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్, ఆర్ఐవో సైమన్‌విక్టర్, డీఈవో సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రానైట్ అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడి



అక్రమంగా నిల్వ ఉంచిన గ్రానైట్ రాళ్లకు మార్కింగ్ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

చీమకుర్తి: రామతీర్థంలోని డంపింగ్‌ల వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన గ్రానైట్ రాళ్లపై విజిలెన్స్ అధికారులు గురువారం దాడి చేశారు. నిల్వ ఉంచిన 60 రాళ్లలో 23 రాళ్లను గుర్తించి మార్కింగ్ ఇచ్చి విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఏడీ వీరేష్ తన సిబ్బందితో ఈ దాడులు చేశారు.

క్లుప్తంగా

265 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన బియ్యంతో అధికారులు

టంగుటూరు: టంగుటూరు నుంచి కావలికి అక్రమంగా తరలిస్తున్న 265 బస్తాల రేషన్ బియ్యాన్ని గురువారం తెల్లవారుజామున విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారం మేరకు అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో 265 బస్తాల బియ్యాన్ని తరలిస్తున్న లారీని సీజ్ చేశారు. నిందితులపై 6ఏ కేసు నమోదు చేసి స్థానిక పోలీసు స్టేషన్లో అప్పగించారు. తనిఖీల్లో ఈడీటీ కృష్ణమోహన్, సీహెచ్ కృష్ణమోహన్, సింగరాయకొండ విజిలెన్స్ సీఐలు రాఘవరావు, నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

15 నుంచి బ్యాడ్మింటన్ సెలక్షన్

ఒంగోలు: ఈనెల 15,16వ తేదీల్లో స్థానిక లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీలో ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జేఎస్ లక్ష్మణ్‌రెడ్డి, పి.విజయ్‌కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 13వ తేదీ సాయంత్రం 6 గంటల్లోగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. సింగిల్ ఎంట్రీ ఫీజు రూ.400, డబుల్ ఎంట్రీ ఫీజు రూ.800 చెల్లించాలని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అకాడమీలో భోజన వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 9398260109, 8886584960ను సంప్రదించాలని సూచించారు.

వరాహ కూనా.. ఊరుకో కన్నా!



పంది పిల్లకు పాలిస్తున్న కుక్క

పొదిలి: ఓ వరాహ కూనకు జాతి వైరాన్ని మరిచి శునకం పాలిచ్చి ఆకలి తీర్చింది. గురువారం పొదిలి పట్టణ ప్రధాన రహదారిలోని హీరో షోరూం వద్ద ఈ దృశ్యాన్ని చూసిన వారంతా ఔరా..! అని ఆశ్చర్యపోయారు.

శునక షోయగం

- 433 పెంపుడు శునకాలకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్
- జూనోసిస్ డే సందర్భంగా పోలీస్ జాగిలాలకు సన్మానం



దాష్ డాగ్



బీగల్



లాబ్ డాగ్



పెంపుడు శునకాన్ని ముద్దు చేస్తున్న యువతి



పోలీస్ జాగిలాల ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థినులు

ఒంగోలు సబర్బన్:

జూనోసిస్ డే సందర్భంగా గురువారం పలువురు జంతు ప్రేమికులు తమ పెంపుడు జంతువులను టీకా కేంద్రాలకు తీసుకువచ్చి ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేయించారు. ఒంగోలులోని బహుళార్ధ పశువైద్యశాలలో పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి ప్రత్యేకంగా పోలీస్ జాగిలాలను శాలువాలతో సన్మానించారు. పోలీస్ జాగిలాలు చేసిన సేవలను ఆమె కొనియాడారు. శునకాల యజమానులు, విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి.. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. సంక్రమిత వ్యాధులకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఒంగోలులో 433 శునకాలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బహుళార్ధ పశు వైద్యశాల ఉప సంచాలకులు డాక్టర్ ఎస్.సోమయ్య, ఇతర వైద్యులు కె.రమేష్ బాబు, జి.పద్మావతి, డి.సురేంద్ర ప్రసాద్, కె.సాహితి పాల్గొన్నారు.



ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి



పోలీస్ జాగిలాలకు శాలువాలు కప్పి సన్మానిస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ



జర్మన్ షెపర్డ్



హస్కి,పమేరియన్ క్రాస్ బ్రీడ్ డాగ్



సిజ్జు









టీకా వేయించేందుకు తీసుకొచ్చిన శునకాలతో యజమానులు



ట్రాక్టర్ ఢీకొని కార్పెంటర్ దుర్మరణం



నరసింహరావు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

టంగుటూరు: ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహన దారుడు మృతి చెందిన సంఘటన టంగుటూరు మండలంలోని కొణిజేడు గ్రామ చాకలిమాన్యం వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొణిజేడు గ్రామానికి చెందిన జక్కుల నరసింహరావు(36) కార్పెంటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. వృత్తిపనిలో భాగంగా ఒంగోలుకు బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో మంగమూరు నుంచి కొణిజేడు వస్తున్న ట్రాక్టర్.. చాకలిమాన్యం మలుపు వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ట్రాక్టర్ టైరు నరసింహారావు తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. గ్రామస్తులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నరసింహారావు మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె కలిగి ఉన్నాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఖాదర్‌బాషా పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

- ఏపీజీబీ ఛైర్మన్ రాకేష్ కశ్యప్



రీజినల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఏపీజీబీ ఛైర్మన్ రాకేష్ కశ్యప్

మార్కాపురం టౌన్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు నూతన టెక్నాలజీ ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామని బ్యాంకు చైర్మన్ రాజేష్‌కశ్యప్ పేర్కొన్నారు. గురువారం మార్కాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏపీజీబీ రీజినల్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. బ్యాంక్ చైర్మన్ మాట్లాడుతూ.. రీజినల్ కార్యాలయ పర్యవేక్షణలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 50 శాఖలు ఉంటాయన్నారు. బ్యాంకు ద్వారా విద్య, గృహ నిర్మాణ, పాడిపరిశ్రమ, ట్రాక్టర్ కొనుగోలుకు 14 మంది ఖాతాదారులకు రూ.3 కోట్ల రుణాలు చెల్లించినట్లు తెలిపారు. తమ బ్యాంకు సామాజిక బాధ్యతలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన సురక్ష, అటల్‌పెన్షన్ యోజనను ఖాతాదారులకు విరివిగా అందిస్తున్నట్లు చెప్పారు. ఏపీజీబీ డిజి ఖాతా యాప్ ద్వారా ఇంటి నుంచే బ్యాంకు అకౌంట్ల ప్రారంభం, మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచామన్నారు. ఇతర బ్యాంకుల కంటే డిపాజిట్లపై అత్యధిక వడ్డీ చెల్లిస్తున్నామని, తక్కువ వడ్డీకే బంగారు, వ్యవసాయ, పరిశ్రమలు పొదుపు సంఘాలు, చేతివృత్తుల వారికి రుణాలు అందజేస్తున్నామన్నారు. సూపర్ సీనియర్ సిటిజన్(80 ఏళ్లు పైబడిన) కేటగిరీ కింద చేసే డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. సబ్‌కలెక్టర్ సేథు మాధవన్ మాట్లాడుతూ.. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఒంగోలు, మార్కాపురం రీజినల్ మేనేజర్లు హేమలత, శ్రీనివాస ప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ మురళి, విశ్రాంత మేనేజర్ నాగలక్ష్మి, రీజినల్ మేనేజర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

గంజాయి జాడ లేకుండా చేయాలి

- పోలీసు అధికారులకు ఎస్పీ మలికా గర్గ్ ఆదేశం



మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఒంగోలు టౌన్: గంజాయి కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో గంజాయి జాడ లేకుండా చేయాలని ఎస్పీ మలికా గర్గ్ ఆదేశించారు. గురువారం జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ మాట్లాడారు. కేసుల దర్యాప్తు వేగంగా పూర్తి చేసేందుకు దోహదపడే సూచనలు చేశారు. గంజాయి పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తి చేసి, వీలైనంత త్వరగా కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని, నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలని సూచించారు. గంజాయి వ్యాపారుల వెనుక ఉన్న లింకులను ఛేదించాలని, గంజాయిని రవాణా చేసేవారితో పాటుగా విక్రయించే వారిని గుర్తించాలని చెప్పారు. మాదకద్రవ్యాలు తీసుకునే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితుల వివరాలను ఇతర జిల్లాల పోలీసులతో సమాచార మార్పిడి చేయాలని, దీనివల్ల అక్కడ కూడా వీరిపై నిఘా ఉంచేందుకు అవకాశం ఉంటుందన్నారు. కోర్టు కేసుల్లో గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా నిందితులకు శిక్షలు పడేలా చేయాలని చెప్పారు. కోర్టు డ్యూటీ అధికారులు, లైజనింగ్ అధికారులు, ఎస్‌హెచ్‌ఓలు సమన్వయంతో పనిచేసి శిక్షల శాతాన్ని పెంచాలని చెప్పారు. జిల్లాలో పాత నేరస్తులపై నిఘా పెట్టాలని, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై విస్తృతంగా దాడులు నిర్వహించి ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. నిరంతరం వాహనాలను తనిఖీ చేయాలని, రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. దొంగతనాలు, దోపిడీల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, నైట్ బీట్స్‌ను బలోపేతం చేయాలని చెప్పారు. సమావేశంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైం) శ్రీధరరావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీసీఆర్బీ సీఐ ధర్మేందర్ బాబు, ఐసీసీఆర్ సీఐ దుర్గాప్రసాద్, కమ్యూనికేషన్ సీఐ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ ఎంతో ముఖ్యం

- ఐసీడీఎస్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

ఒంగోలు సబర్బన్: బాలల పరిరక్షణ ఎంతో ముఖ్యమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. స్థానిక జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ కార్యాలయంలో బాలల పరిరక్షణలో నెలకొన్న సమస్యలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషన్ సభ్యురాలు పద్మావతి మాట్లాడుతూ ఐసీడీఎస్ అధికారులు బాలల పరిరక్షణ విషయంలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, ఐసీపీఎస్‌లు, ఓఎస్ఎస్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది బాలల పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఒంగోలులో ఇటీవల ఇబ్బందులకు గురైన బాలికను సత్వరం పాఠశాలలో చేర్పించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్క అంగన్‌వాడీ కార్యకర్త తమ పరిధిలో బాలలపై జరిగే అన్యాయాలు, అక్రమాలను వెంటనే కమిషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. బాధిత బాలకలకు పరిహారం ఇప్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ కే మాధురి, డీసీపీవో పి.దినేష్‌కుమార్, సీడబ్ల్యూసీ సభ్యురాలు నీలిమ వంశీలత, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎన్ఎంపై అసత్య ఆరోపణలు

- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు పీహెచ్‌సీ డాక్టర్ల అసోసియేషన్ విజ్ఞప్తి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు

ఒంగోలు అర్బన్: పుల్లలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కంచర్ల నాగార్జునగౌడ్‌పై ఏఎన్ఎం దేవికాబాయి అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పనితీరు మెరుగుపరుచుకుని, పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పినందుకు వైద్యాధికారిపై అసత్య ఆరోపణలు చేశారని డాక్టర్లు వివరించారు. గతంలో డాక్టర్‌ను దూషించిన విషయమై విచారణ కూడా జరిగిందని తెలిపారు. కాగా ఏఎన్ఎం ఆరోపణలను అసోసియేషన్ సెక్రటరీ జనరల్ షేక్ ఖాదర్ మస్తాన్‌బీ, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్ ఖండించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డాక్టర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వనారియల్, కోశాధికారి సీహెచ్ సరస్వతి, డాక్టర్లు సుందర్, రమేష్‌కుమార్, కుమారస్వామి, కిరణ్మయి, జ్యోతి, చైతన్య దీపక్, అక్తర్‌రసూల్, హేమంత్, రజిత మానస, నబీ, వైష్ణవితదితరులుపాల్గొన్నారు.